# అభ్యుదయానికి హైరోడ్డు

యం. వై. రెడ్డి

కథానిక

ఆ రోజు, ఆ గ్రామం — గ్రామమంతా సంతోష తరంగాలతో పెల్లుబికిపోయింది. ఒక క్షణం పాటు ఆనందం శిథిలగృహాలను కూడా మధురానుభూతులతో నింపి, తేలిపోయింది. ఆ గ్రామానికి చెందిన పదహారు వందల తలలు ఆ రోజు రచ్చబండమీద సమావేశమయ్యాయి. పదహారు వందల నోళ్ళకు విసుగు, విరామములేని పని కలిగింది. ఆ కార్యమును సంతోషంతో స్వీకరించారు అమాయకులైన ఆ గ్రామప్రజలు. ఆ మహత్కార్యఫలితమే ఈ సమావేశం! అందరూ పూర్వ సంఘటనలను నెమరువేయ ప్రారంభించారు. ఆ ఊరికి చెందిన ఇద్దరు పంచాయతీబోర్డు సభ్యుల ప్రజ్ఞను విశేషంగా మెచ్చుకొన్నారు;ఆదరించారు; కీర్తించారు.

ప్రతిమనిషి ఆ మహత్కార్యంవలన తమకు కలుగబోయే లాభాలను నెమరువేస్తూ చిరునవ్వులను ప్రదర్శించాడు. ఒకరి చిరునవ్వులు ఇంకొకరు పరిశీలిస్తూ విశేషంగా నవ్వారు. ఇంతకూ, ఆ మహత్కార్యం: పట్టణమునకు పోతున్న రహదారినుండి తమ గ్రామమునకు ఐదుమైళ్ళ పొడవుగల రహదారి నిర్మించటమే! ఆ మహత్కార్యాన్ని ప్రభుత్వం భుజస్కంధాలపై మోయ నిర్చయించటం, ఆగ్రామ ప్రజల సహాయసానుభూతుల నందింది.

అందరు ఆలోచనలో పడిపోయారు. రైతు పుల్లయ్య, అబ్బే, పుల్లారెడ్డి,డిబ్బయ్యతో అన్నాడు “ఆహా! ఇకమనపద్దుకిక ఫరవాలేదు, డిబ్బయ్యా! లోటు యేస్తున్నారుకదూ, ప్రభుత్వమోళ్ళు. ఎంత వర్షంపడినా మనమా లోటుమీద మనబండ్లను తోలుకోవచ్చుకదూ! బురద...మట్టి—మశానము రాయి–రప్ప...ఇలాంటివి ఏమీఉండవు!ఏన్నాళ్ళకేసేస్తారు లోటు?” డిబ్బయ్య సంతోషంతో పండ్లికిలికించాడు.

కోమటి సుంకన్న అంటున్నాడు, “సుబ్బిశెట్టి! ప్రభుత్వంఅంటే ఇలాఉండాలి! లోటువేస్తారుకదూ లోటు... ఈ లోటు మనకోసమే యేస్తున్నట్లున్నారు? మనకింకా లాభాలు వస్తాయి! ప్రయాణపు ఖర్చులు తగ్గుతాయి; మన సరుకులు ఇదివరకటి ధరకే అమ్ముకోవచ్చు! అప్పుడు లాభం ఎక్కువ వస్తుంది! లాభం లాభం... లాభంరా!...” ఈ మాటలు వర్తకుల చెవులలో ప్రతిధ్వనించాయి.

పంచాయతీబోర్డు సభ్యులు, మునసబు, కరణం అనుకున్నారు. “దేవుడా, ఇదిఅంతా నీదయ! నీ దయలేనిది ఈ ప్రపంచంలో ఏదైనా జరుగగలదా? మా కొంపలు నిలబడటానికి ఓదారి చూపావు. (ఇదివరకు పడిపోయేస్థితిలో ఉన్నట్లు!) డబ్బు గడించుకోటానికి ఇదే చక్కని మార్గం. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలికదూ!” వారి మనసులు సంతృప్తినొందాయి.

ఆ పల్లియలో మనిషన తగిన ప్రతివాడు, “ఈ మహత్కార్య” సాధనకు అత్యంత, కృషిచేసిన పంచాయతీబోర్డు సభ్యులను మెచ్చుకున్నాడు.

వారి కృషి:

తమ గ్రామమునకు కంకరరోడ్డు కావలననే ఆలోచన పంచాయితీబోర్డు సభ్యులకు, మునసబు గారికి ఎలా తోచిందో చెప్పలేంకాని, తోచిన వెంటనే కార్యోన్ముఖులయ్యారు. ఏకంగా ఒక దస్తా కాగితములను, నాలుగయిదు ఊటకలాలను, (రకరకములైన సిరాలతో) ఒక కాపీయింగ్ పెన్సిలు, శిథిలావస్థలోనున్న నాలుగు పెన్సిళ్ళను సంపాదించి, సంతకాల సేకరణకు బయలుదేరారా సేవకులు. ఆ సేవకులు కార్యోన్ముఖులైన దిన మెట్టిదోకాని, వారు చేపట్టిన పనిమాత్రం అవిఘ్నంగా సాగిపోయింది. ప్రతిమనిషితో వారుచెప్పే మాటలు: “పైకి అర్జీపంపుతున్నాం, మనకు రోడ్డు వస్తుంది. సంతకంపెట్టవయ్యా సంతకం. అరరే!... నీకు చదువురాదుకదూ, బొటనవ్రేలి గుర్తు వేయి చాల్లే!” ఒక ముసలి రైతుమాత్రము తన అనుమానమును వెల్లడించాడు· “ఏంగుర్తులో లేవయ్యా. అంతా మా పానాలమీదికొచ్చింది. మొన్న మీ

మాదిరే ఎవరో వచ్చారు. వచ్చినోళ్ళు ఊరకే పడి ఉండక కాలువమీద వంతెన వేయిస్తాం, సంతకాలు పెట్టండి అంటూ ఏంచేసినారో తెలుసా?... ఆ కల్లిబొల్లి మాటలతో మమ్మలందరినీ మోసంచేసి, తమ కాస్త పని ముగించుకొని, వాళ్ళు చేసిన ఘన కార్యం. దూదేకుల కాశన్న ఉన్నాడు చూడండి, ఉంటానికి ఇల్లులేక ఊరిబయట గుడిసెవేసుకుంటే, వాడిని లేవగొట్టి తమ దిబ్బను వేసుకున్నారు... ఇట్లా ఉంటుందయ్యా ప్రపంచం! ఏమైనాకానీ బాబు, నేనుమాత్రం నా బొటనవ్రేలిగుర్తువెయ్యను. తరువాత మీ యిష్టం.”

ఇలాటివారినందిరినీ సమాధానపరచలేక, ఆ సేవకులు సరంజామానంతా తీసుకుని, తామే రకరకాల సంతకాలు వేయ ప్రారంభించారు. మొదట సిరాతో, తరువాత పెన్సిలుతో,మరల పెన్సిలుతో, తరువాత ఎడమచేతితో...అనేక రకములుగా ఆ త్రిమూర్తులు సంతకాలవుతే ఏం, బొటనవ్రేలి గుర్తులవుతే ఏం, ఆరువందలు సేకరించారు.

ఆ ఫోర్జరీ చేవ్రాళ్ళను తమ విన్నపముతో చేర్చి జిల్లా కలెక్టరుగారి దివ్యసముఖమునకు పంపారు. ఆయనగారు పరిశీలనకై డివిజనల్ ఇంజనీరువారికి పంపారు. ఆ పరమధార్మికుడు ఆ గ్రామమును పరిశీలించి, సౌకర్యములను గమనించి నివేదికను సమర్పించుకోవలసినదని అసిస్టెంటు ఇంజనీరుగారికి తాఖీదు పంపాడు. ఇంజనీరుగారు, జూనియర్ ఇంజనీరాది అనుచరవర్గ సమేతుడై గ్రామముపైకి దాడివెడలినాడు. ఆదాడి ఫలితమే ఈ సమావేశం. విజ్ఞాపన పంపిన ఆరునెలలకీ అత్యవసర సమావేశం ఏర్పరచబడింది.

ఆ సమావేశమునకు అధ్యక్షత వహించవలసిన బాధ్యత మునసబుగారిపై పడింది (ఆయన కావాలని పోరాడి, ఆ పదవినధిష్ఠించాడు;అందుకు కరణంగారు గ్రుడ్లెర్రజేసినా లెక్కపెట్టలేదు. (తనకు తప్పనిసరి అయినందున అధ్యక్షపీఠము అలంకరించవలసి వచ్చిందని చిలుకపలుకులు పలికాడనుకోండి!) పంచాయితీ బోర్డు సభ్యుల గొంతులు ఖంగున మ్రోగాయి, కాని, ఆ ఉపన్యాసం కాస్త రహస్య సంభాషణగా మారింది. అధికారులు (అనధికారుల హస్తములలో కూడా కొంత అధికారం లేకపోలేదు) చెప్పిన మాటలు.

“మన ఊరికి కంకరరోడ్డు కోసము మనము పంపిన విన్నపమును ప్రభుత్వంవారు దయతో మన్నించారు. ఇప్పుడు మనము చేతనయినంత సహాయం చేయాలి; చూడండి! అన్ని ఖర్చులను ప్రభుత్వమునే భరించమనటం అంత తెలివైన పని కాదనుకుంటాను; మనమంతా తలా ఓచేయివేసి సాయం చేయాలి...ఎవరికి చేతనయినంతవాళ్ళు” నసిగాడు పంచాయితీబోర్డు సభ్యుడు.

మునసబుగారు అతనిలో తన గొంతుకు పని కల్పించాడు. “ప్రభుత్వంవాళ్లు ధర్మాత్ములు; కాబట్టి వాళ్లు మన వూరికి రోడ్డు వేస్తున్నారు; లేకుంటే వారికేంపట్టింది? అధమం మన ఇంజనీర్లకు, మిగతా దొంగలకు, వారి సిబ్బందికి కాబోయే ఖర్చులయినా భరించాలి; అందుకోసం డబ్బు వసూలు చేద్దాం! ప్రతిరైతు ఎద్దుకు ఐదు రూపాయలు ఇవ్వాలి! ‘ఉడుతాభక్తి’ అన్నట్లు మన చేతనయినంత సహాయం...” అధికార స్వరంతో గొణిగాడు మునసబు.

శ్రోతల ఉత్సాహం ఈ మాటలతో ద్విగుణీకృతం అవుతుందని మునసబుగారు ఆశించినా, అందుకు వ్యతిరేకమైన పరిస్థితులు పొటమరించాయి. శ్రోతలలో మచ్చుకైనా ఉత్సాహలేశము లేకపోయింది. అందరు పన్నులభారంతో వంగిన తలలను విధిలేక పైకెత్తి విషాదంగా నవ్వారు. ఆ ఉద్దేశమును అధికారులు గమనించినా గమనించనట్లు ప్రవర్తించారు.

కరణంగారన్నారు. “అబ్బే! మునసబుగారు పాషాణహృదయునినా ఉన్నారు; నేనవుతే అంత డబ్బును వసూలు చేయటానికి ప్రయత్నించను!” మునసబుగారు గ్రుడ్లెర్రచేయుట గమనించి కరణంగారు రాజీ ప్రయత్నానికి దిగాడు “అంతే ననుకోండి! మునసబుగారు బహుశా మంచిపనే చేశారేమో! అంతడబ్బు తప్పనిసరి అనుకుంటా” కరణంగారు భయపడుతూ మునసబుగారిని పరికించాడు.

శ్రోతలు విధిలేక, సవరణలు ప్రతిపాదించే ధైర్యంలేక షరతులన్నిటినీ అంగీకరించారు. ఒక వారం రోజులకు పంచాయితీబోర్డు సభ్యులు, మునసబు—కరణాలతో కూడి, అసిస్టెంటు ఇంజనీరుగారిని సందర్శించి తమ జన్మములు తరించినట్లుగా భావించారు. మునసబుగారన్నారు “దొరవారు

మన్నించాలి. ఏదో మాకు తోచినంత! అరరే! మీరేమీ అనుకోకండి. బహుమాన రూపంగా ఏదో కొంత..." తన సమీపంలో నిలుచున్న పెద్దమనుష్యులు వేయి రూప్యములు సేకరించారని అసిస్టెంటు ఇంజనీరుగారికి అవగతమే గనుక చిరాకు ప్రదర్శించ మొదలెట్టాడు. మునసబు అయిదువందల రూప్యములు తాంబూలాదులతో ఇంజనీరు గారి హస్తాంబుజమునందుంచాడు. ఇంజనీరుగారి ముఖము వింతగా ప్రకాశించింది. "ఊ, సరేలే!" అన్నాడు బెట్టుసరిగా.

మిగిలిన 500 రూకలను తమతమ గృహములందు భద్రమొనరించారా ప్రజాహితులు. చివరకి ఆ పెద్దలే రోడ్డును కంట్రాక్టు తీసుకోవటం గ్రామ ప్రజల నాశ్చర్యపరచింది. అందులో ఏఒక్కరికీ తమ ఆశ్చర్యమును వెలిబుచ్చే ధైర్యంలేకపోవటం శోచనీయమని వారికి తెలియదు!

ఒక పుణ్యదినమున (పెద్దలను మాత్రము) అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు ప్రజా సేవకులు. అందరి ఉపన్యాసాలు పోతపోచినట్లు నడిచాయి. ఆ ఉపన్యాసాల సారాంశము "అందరు శ్రమదానం చేయాలి; రైతులందరు రేపు పొలం పనులకు పోకూడదు. ప్రతిరైతు తమతమబండ్లతో రేపు కంకరతోలాలి! మన కోసమేగా ఈ రహదారి నిర్మించటం! అందరు తప్పకరావాలి!" రైతులకు ఆ ఆజ్ఞను ధిక్కరించే "కలేజా" లేకపోయింది. ఆ అమాయిక ప్రజలు తమ జీవితములో ఒక పదానికి మాత్రము అర్థం తెలుసుకున్నారు; ఆ పదం: "శిరసావహించుట"

రహదారి నిర్మించబడింది. నిర్మించబడటమే! బండ్లబాటను కొద్దిగా బాగుచేశారు. రైతులు తోలిన రాళ్ళను ఆ బాటమీద పరచి, రోలరు త్రిప్పి, కొద్దిగా ఇసుకజల్లి, పని అయిందనిపించారు, అది రోడ్డుకాదని ఏవరనగలరు? కావలసివుంటే. సాంకేతిక నిపుణుడైన ఇంజనీరుగారి ఆమోదముద్ర చూపిస్తారు. శాస్త్రీయంగా, అత్యంత సాంకేతికంగా తయారయింది ఆ రోడ్డు. "ఏలాకాదన్నా, పదివేలయినా శాంక్షన్ చేసి ఉంటుంది ప్రభుత్వం" అని గ్రామప్రజల అంచనా ఆ రహదారి నిర్మాణానికి ఒకవేయి రూపాయలు ఖర్చు అయివుంటాయేమో. మిగతాధనం? ఆ ధనం అనేకుల హస్తగతమైంది. ఆ విషయమును ఎవరూ పట్టించుకొనరు!

రహదారి నిర్మాణానంతరం ప్రారంభోత్సవం జరుపబడింది. ఆ రోజు కరణంగారు రిబ్బను కత్తిరించారు. ప్రజల శ్రమదానమును ఏకకంఠంతో ప్రశంసించారు అనేకులు. శ్రమదాతల నందరిని కలిపి ఒక ఫోటోతీసారు. ఆ ఫోటోలోఉన్నవారు అప్పటికప్పుడు తట్టలను తమ భుజస్కంధములపై మోపి నిలిచిన మునసబు, కరణము, పంచాయితీ బోర్డు మెంబర్లు, ప్రేక్షకులలో కొంతమందీ. "ప్రభుత్వమునకు ప్రజల విశేషసహాయ సానుభూతులు; రైతుప్రజల ఉత్సాహం" అంటూ దిన పత్రికలలో ఆ ఫోటో ప్రచురితమైంది.

ఆ ఫోటోను చూచి సేవకులందరు సంతోషించారు. భారత దేశం అభివృద్ధి పథకాలతో, అద్వితీయమైన వేగముతో ముందుకు సాగిపోతోంది; కాదని ఏవరనగలరు?

---

తాను పుట్టిపెరిగిన పల్లెటూరు చూడ వెళ్ళాడు ఓ పెద్దమనిషి. ఎరుగున్న వారిని చూసితిరిగి స్టేషనుకి వచ్చేసరికి ఓ గుంపు అక్కడ చేరి వుంది - అతన్ని సాగనంపడానికి. కాని అతను కృతజ్ఞత తెలుపుతూంటేనే రైలు కదిలిపోయింది. పెద్దమనిషి పక్కనేవున్న మరొక పెద్దమనిషి అన్నాడు "అయ్యో, మీ ఉపన్యాసం పూర్తి కాకుండానే రైలు కదిలిందే!"

"నిజమే, ఆ గుంపు రైలు నడిచినకొద్దీ, సంతోషంగా అరుస్తూంటే, ఆ సంతోషం ఇంజను డ్రైవరునిచూసో, నన్నుచూసో, నిశ్చయించుకోలేక పోతున్నాను" అన్నాడు అసలు పెద్దమనిషి!